# హంసలను వేటాడొద్దు [9]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [9]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యేవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: మే 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2646

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [9]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** పడవపోగొట్టి రేవు అధికారి యకోవ్ ప్రోకోవిచ్ కు మూడువందల రూబుళ్లు బాకీ పడిన యెగార్, అది తీర్చటానికి తన పెంపుడు పందొనొకదాన్ని చంపి ఆ మాంసం అమ్మేందుకు పట్టణం వెళ్తాడు. అక్కడ ఇద్దరు అతణ్ణి మోసం చేస్తారు. దాదాపు నాలుగువందల రూబుళ్ల గిట్టుబాటయ్యే ఆ మాంసాన్ని కేవలం రెండువందల రూబుళ్లు ఇచ్చి చేజిక్కించుకుంటారు. యెగార్ ఆ డబ్బుతో ఇంటికి వచ్చి అందర్నీ విందుకు ఆహ్వానిస్తాడు. అతని తోడల్లుడు ఫ్యోడార్ ఇపటోవిచ్, రేవు అధికారి యకోవ్ ప్రోకోవిచ్ అంతా వస్తారు. ఫ్యోడార్ ఇపటోవిచ్ అంత తక్కువ ధరకు మాంసాన్ని అమ్మినందుకు యెగార్ ని నిందిస్తాడు. కానీ తాగి ఉన్న యెగార్ 'నా యింట్లో ఎవరూ రూబుళ్ల లెక్కలు మాట్లాడటానికి వీల్లేదని' గట్టిగా బల్లగుద్ది అందరి నోళ్లూ మూయిస్తాడు. కోల్కా తన కోపం మరిచిపోయి తండ్రితో కలిసిపోతాడు. **ఇక చదవండి:—**

## 9

మరునాడు ప్రభుత్వ కొనుగోలు కార్యాలయం వద్ద ఒక ప్రకటన అతికించి ఉంది. ఆ ప్రకటన దినపత్రిక అంత పెద్దగా ఉంది. ప్రజలనుంచి లిండెన్ బెరుడును ప్రాంతీయ కొనుగోలు అధికారులు తీసుకుంటారని పౌరులందరికీ పెద్ద అక్షరాలలో అది తెలియచేస్తోంది. ఊరబెట్టి, ఎండబెట్టిన బెరడుకి కిలోకి అర్ధ రూబులు ఇస్తారు, అంటే యాభై కొపెక్కులు.

ఆ ప్రకటనను చదువుతూ యెగార్ చాలా సేపు నిలబడ్డాడు. కొన్ని లెక్కలు కూడా వేశాడు: కిలోకి అర్ధ రూబులు — అంటే రెండు కిలోలకి రూబులు. మణుగుకి ఆరు రూబుళ్లు: డబ్బులు. రోజుకి ఎనభై కిలోలు తియ్యగలిగితే చాలా డబ్బు సంపాదించవచ్చు. ఇంకో వైపున ఫ్యోడార్ ఇపటొవిచ్ ఎటువంటి లెక్కలు వెయ్యలేదు. అతడికి అంత సమయం కూడా లేదు: ప్రకటన చదివిన వెంటనే అతడు గుర్రాన్ని బండికి కట్టటానికి పరిగెత్తాడు. బండిలోకి ఎక్కి ఓవాతో కలిసి అడవిలోకి ప్రయాణమయ్యాడు. కావలసిన కత్తులు కూడా సిద్ధంగా ఉన్నాయి. బెరడు తియ్యటానికి అతడికి అనుమతి కూడా అవసరం లేదు. పడిపోయిన చెట్లమధ్యనుంచి దారిచేసుకుని లిండెన్ తోపులకి వెళ్లాల్సిన అవసరమూ రాలేదు: ముందు వచ్చిన వాళ్లకి ముందు అన్నది పాత నియమం. ఈలోగా

యెగార్ మాంసంలేని క్యాబేజి పులుసు తాగుతూ దుకాణాదారులాగా లెక్కలువెయ్యసాగాడు. “మణుగుకి ఆరు రూబుళ్లన్నమాట. మనసు పెట్టి పని చేస్తే ఒక్క రోజులో నెల జీతం సంపాదించవచ్చు.” హారిటీనా ఏమాత్రం వాదించలేదు: పంది వ్యవహారం తరువాత ఆమె పెద్దగా మాట్లాడటం లేదు. ఇంటిలో అటూ, ఇటూ మెసిలేది, కాలనీ బజారుల్లో తిరిగేది, పరిచయం ఉన్నవాళ్లను కలిసేది. అందరితో మొరపెట్టుకునేది, విన్నవించుకునేది, బతిమాలేది. యెగార్ ఏమీ పాలుపోని స్థితిలో ఉన్నాడు: ఎవ్వరూ అతనికి సలహా ఇవ్వలేదు, అలాగని అతడు ఎవరినీ అడగనూ లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మగవాడినన్న గర్వాన్ని నిలుపుకోవాలాయె. బెరడు విషయానికి వస్తే – అది వాస్తవం. ముందుగా మేల్కొన్నవాళ్లు అటవీ అధికారి – అంటే ఫ్యొడార్ ఇపటొవిచ్ నుంచి – అనుమతి తెచ్చుకుని శనివారం, ఆదివారాల్లో తెల్లవారకముందే అడవుల్లోకి వెళ్లిపోయారు. అలా ఉదయం వెళ్లిన వాళ్లు ఒక పాతిక కిలోల బెరడుతో తిరిగి వచ్చేవాళ్లు. అడవిగుండా వీపుమీద పాతిక కిలోలు మోసుకొస్తే, సంపాదన పెద్దగా ఉండదని అందరికీ తెలిసిందే. మోటరుసైకిలు ఉన్నవాళ్లు ఓ యాభై కిలోలు తీసుకురాగలిగేవాళ్లు. ఒక వారంపాటు దానిని ఊరబెట్టి, మెలిపెట్టి, ఎండబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లేవాళ్లు. అక్కడ వాటిని తూకం వేయించేవాళ్లు. అయితే, ఫ్యొడార్ ఇపటొవిచ్ ఇటువంటి చిన్న చిన్న విషయాలపై తన శక్తిని వృథా చెయ్యదలుచుకోలేదు: మొదటిరోజు రాత్రే అతడు తన గుర్రపుబండి నిండా బెరడుతో బయటకు వచ్చాడు. ఆ బరువును గుర్రం ఎంతో కష్టంమీద లాగగలిగింది. ఆహాఁ – అతడిది ఏమి తెలివండి! ఈ గుర్రపుబండిని అతడు ఊరులోకి, అయిదు కిటికీల తన ఇంటికి తెచ్చాడనుకుంటున్నారా – అనవసరంగా అధికారుల కళ్లల్లో పడటమెందుకు? గుర్రపుబండిని నేరుగా కాలవలోకి తోలి, గుర్రాన్ని అక్కడ ఊడదీశాడు, బండితోపాటు బెరడు ఊరటానికి అక్కడ వదిలిపెట్టాడు: గుర్రపుబండేమీ మోటరుసైకిలు కాదకదా, నీళ్లల్లో నానితే పాడైపోటానికి. దీనివల్ల గుర్రానికి శ్రమ తగ్గుతుంది, తన గురించి అనవసరపు మాటలు అంతగా ఉండవు, బండిలో ఉన్న సరుకు అక్కడే ఊరుతుంది. బెరడు బాగా ఊరిన తరువాత బండికి గుర్రాన్ని కట్టి ఒడ్డుకి లాక్కొస్తే సరిపోతుంది. బెరడును దులిపి, ఎండబెట్టటం మారిట్సా పని. అదీ కాకుండా అతడి దగ్గర రెండో బండి ఉంది: గుర్రాన్ని దానికి కట్టి అవకాశం ఉన్నంతవరకు డబ్బు చేసుకోటానికి బెరడు వలిచెయ్యటమే. తన తోడల్లుడు ఇంకా ఆలోచనల్లో ఉన్నప్పుడే ఈ విధంగా ఫ్యొడార్ ఇపటొవిచ్ అడవినుంచి మూడు బళ్ల బెరడు తెచ్చాడు.

ఆ క్రమంలో అతడు అలసిపోయాడన్నది నిజం: చెమటోడ్చి పనిచెయ్యాలి మరి. అతడు ఓవాకి విశ్రాంతి లేకుండా చేశాడు, తానూ శక్తికి మించి పనిచేశాడు, గుర్రాన్ని పీల్చి పిప్పి చేశాడు. అలసిపోయిన ఓవా వాకిట్లోనే కుప్పకూలిపోయాడు, వాళ్లమ్మ అతడిని తీసుకెళ్లి మంచంలో వేసింది. ఫ్యొడార్ ఇపటొవిచ్ మాత్రం అచ్చం ఇంట్లో పుదీనా వేసి, కాచిన సారాయి మీద బతికాడు. అది ఎంతో బలాన్ని ఇస్తుంది. ఆ రోజు అతడు తన ఆరోగ్యం కోసం ఒక గ్లాసు సారాయి తాగాడో, లేదో (సారా సీసాను బల్ల మీదనుంచి తీసే సమయం కూడా మారిట్సాకి లేదు), యెగార్ పొలుష్కిన్ అక్కడికి వచ్చాడు. అతడి గడ్డం మాసి ఉంది. "బాగున్నావా, భోజనం చేస్తున్నట్టున్నవు." ఫ్యొడార్ ఇపటొవిచ్‌కి గొంతు పూడుకుపోయింది – మద్యంతో కాదు, దుఖంతో. "కూర్చోండి, ప్రముఖ వ్యాపారవేత్త అయిన తమ్ముడుగారు."

ఆ వ్యంగ్యం యెగార్‌కి అర్థమయ్యింది, కానీ అతడు దానిని పట్టించుకోలేదు – అతడి దృష్టి మరోచోట ఉంది. అతడు తలూపి, ధన్యవాదాలు తెలిపి, చిరునవ్వు నవ్వి టోపీ తగిలించటానికి తలుపువైపుకి తిరిగాడు. టోపీ తగిలించి, కోటు సరిచేసుకుంటూ బల్ల దగ్గరకి వచ్చేసరికి సారా సీసా అక్కడ లేదు. తన కళ్లను తానే నమ్మలేనట్టు అతడు మిటకరించాడు. సారా సీసా, గ్లాసుకి బదులు అక్కడ ఉడకబెట్టిన బంగాళాదుంపలతో ఒక గిన్నె ఉంది. కొంచెం పంది మాంసం కూడా ఉందనుకోండి.

"పనిమీద నీ దగ్గరకు వచ్చాను, ఫ్యొడార్ ఇపటొవిచ్."

"నువ్వు ముందు తిను. పని గురించి తరువాత మాట్లాడవచ్చు."

వాళ్లు తిన్నారు. మారిట్సా టీ తీసుకొచ్చింది, వాళ్లు తాగారు. తరువాత చుట్టలు వెలిగించి అసలు విషయంలోకి వచ్చారు.

"నీ నుంచి అనుమతి పత్రం కావాలి, బెరడుకు సంబంధించి. కిలోకి అర్థ రూబులు ఇస్తారు."

"అది నిజమా?" ఆశ్చర్యం ప్రకటిస్తూ ఫ్యొడార్ ఇపటొవిచ్ అడిగాడు.

"మనది చాలా సంపన్న దేశం: ఇక్కడొక అర్థ రూబులు, అక్కడొక అర్థ రూబులుతో ఏం కాదు."

"అలా ఇస్తున్నంతవరకేలే ఏదైనా..." ఫ్యొడార్ ఇపటొవిచ్ గొణిగాడు. తరువాత పెద్దగా నిట్టూర్చాడు.

"ఏమైనా అంత మంచి పనికాదు," అతడు కొనసాగించాడు. "అది రిజర్వు అడవి: దానిని జల రిజర్వాయరు అంటారు. మనమేమో దాని తోలు వలిచిపారేస్తున్నాం."

"అఁహ్, అవును..."

"ఒక లిండెన్ చెట్టు బెరడు వలిచేశావనుకుందాం. అది ఎండిపోతుంది. నువ్వు లాభం చేసుకున్నావు, కానీ ప్రభుత్వం సంగతేమిటి? ప్రభుత్వానికి నష్టమే కదా."

"నువ్వు చెప్పింది నిజమే. అయితే బెరడు ఎలా తీశారన్నదానిమీద అది ఆధారపడి ఉంటుంది. నీకు తెలుసు కదా –"

"మనం ప్రభుత్వం గురించి ఆలోచించటం లేదు," ఫ్యొడార్ నస పెడుతూనే ఉన్నాడు. "మనం రష్యా గురించే ఆలోచించటం లేదు. కానీ, ఆలోచించటం మన ధర్మం."

"తప్పనిసరిగా ఆలోచించాలి, ఫ్యొడార్ ఇపటొవిచ్. అది మన విధి!"

ఇద్దరూ నిట్టూర్చి, ఆలోచనామగ్నులయ్యారు. చేతిలోని చుట్టలవైపు చూడసాగారు.

"నువ్వు చెప్పినట్టు, బెరడు తీసే విధానం తెలిసి ఉండాలి, యెగార్ మిత్రమా. అయితే భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకోవాలి, దాని గురించి కూడా ఆలోచించాలి."

"అది నాకు తెలుసు, ఫ్యొడార్ ఇపటొవిచ్."

"అదీ విషయం, నేను చెప్పవలసింది చెప్పాను. అయితే నువ్వు నా బంధువువి, అంతే కాకుండా నువ్వు ఉన్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని నీకు అనుమతి పత్రం రాసి ఇస్తాను."

యెగార్ పరిస్థితిని ఫ్యొడార్ ఇపటొవిచ్ సానుభూతితో పరిశీలించాల్సిన అవసరం ఉండింది. మునిగిపోయిన మోటరు తాలూకా అప్పును యెగార్ ఆపాటికే తీర్చేసినప్పటికీ పర్యాటక కేంద్రంలోని ఉద్యోగంలో ఇప్పుడు లేడు. ఆ ఉద్యోగాన్ని అతడు తన ఇచ్ఛాపూర్వకంగానే వదిలిపెట్టేశాడు.

"ఇవి నా సిద్ధాంతాలు, యకోవ్ ప్రొకొపిచ్." మళ్లీ తనని ఎక్కడికి పంపిస్తే అక్కడికి వెళ్లసాగాడు, ఏ పని చెబితే ఆ పని చెయ్యసాగాడు. అతడు తనకు సాధ్యమైనంతగా ప్రయత్నించసాగాడు. అయితే అది ప్రయత్నమని కూడా అనటానికి లేదు: ఉద్దేశపూర్వకంగా

చెయ్యటాన్ని, అంతా బాగుండాలని బలవంతంగా చెయ్యటాన్ని ప్రయత్నించటం అంటాం. అయితే, ఏదైనా లోపభూయిష్టంగా చెయ్యాలని కానీ, ఎవరినైనా మోసం చెయ్యాలని కానీ, పని అయ్యిందంటే అయ్యిందనిపించేలా పూర్తి చెయ్యాలని కానీ యెగార్‌కి లిప్తపాటు కూడా అనిపించదు. అతడు జీవితం మొత్తాన్ని తన అంతరాత్మ ప్రకారమూ, భయంతోనూ జీవించాడు. అయితే, అతడు చేసిన పనులు సరిగా ఉండకపోవటం అతడి దురదృష్టమే కానీ అతడి లోపం కాదు. పుట్టుకనుంచీ ఇది అతడిని వెంటాడుతోందని చెప్పవచ్చు.

శనివారం ఉదయం – మంచుతెర నేలమీద తేలియాడుతూ అప్పుడే తొలుగుతోంది – యెగార్ కత్తులకు పదును పెట్టుకుని, నడుము పటాకాకి గొడ్డలి తగిలించుకుని, తాడు తీసుకుని రిజర్వు అడవికి బయలుదేరాడు. కిలో అర్థ రూబులు విలువ చేసే బెరడు కోసం. తనతోపాటు కోల్కాని కూడా తీసుకెళ్లాడు: ఒక మణుగు అదనంగా సేకరించారంటే ఆరు రూబుళ్లు అదనంగా దొరుకుతాయి. అయితే అప్పటికి ఇంకా అదనం అనేది ఇంకా ఏమీ లేదనుకోండి.

“లిండెన్ చాలా ముఖ్యమైన చెట్టు,” అడవి దారివెంట నడుస్తూ చెప్పాడు యెగార్. “గతంలో రష్యాలో కొండ కింది భాగాలలో సగం ఈ చెట్టుతో ఉండేది. అది గరిటలకు కలపనిచ్చేది, ప్రజలకు తీపినిచ్చేది.”

“దాంట్లో తియ్యగా ఉండేది ఏమిటి?”

“దాని పూత. ఈ పూలనుంచి వచ్చే తేనె బంగరు వన్నెలో ఉంటుంది, చాలా ప్రత్యేకమైనది. అత్యధిక తేనెనిచ్చినందుకు తేనెటీగలు లిండెన్‌ని గౌరవిస్తాయి. అది చాలా ఉపయోగకరమైన చెట్టు.”

“భుజపత్ర చెట్టు సంగతేమిటి?”

“అది అందానికి.”

“అయితే బండి గురువింద?”

“అది వస్తువులకు. బండి గురువింద, కవుకు, దేవదారు, లర్చ్ చెట్లు ఇల్లు కట్టుకోటానికి, వస్తు సామగ్రికి మంచివి. కొడుకా, ప్రతి చెట్టుకీ ఏదో ఒక ఉపయోగం ఉంటుంది: ఎందుకూ పనికిరానివంటే ప్రకృతి తల్లికి ఇష్టం ఉండదు. ఒక చెట్టు మనిషికి – అతడి అవసరాలకోసం – పెరుగుతుంది, మరొకటి అడవి కోసం, అన్ని రకాల పురుగుల కోసం, లేదా పుట్టకొక్కులకోసం

పెరుగుతుంది. అందుకే గొడ్డలితో ఏదైనా చెట్టు కొట్టబోయేముందు ఎవరికీ: ఒక జింక లేదా కుందేలు, ఒక పుట్టకొక్కు లేదా ఉడత లేదా ముళ్లపందికి హాని కలిగించటంలేదని చుట్టూ పరికించి చూడాలి. వాటికి హాని చెయ్యటమంటే నీకు నువ్వు హాని చేసుకోవటమే; నరికేసిన అడవిని అవి విడిచిపెట్టి వెళ్లిపోతాయి. ఆ తరువాత నువ్వు ఎంత ప్రయత్నించినా అవి తిరిగి రావు."

ఎవరూ నడవని దారిలో, మంచు తడిచిన గడ్డిలో కాళ్లకు చెప్పులు లేకుండా నడుస్తూ, పిట్టల కూతలు వింటూ, ప్రతి ఒక్కదానికి ఏర్పాటు చేసి, జీవరాశులన్నింటి ప్రయోజనం కోసం అన్నీ కల్పించిన ప్రకృతి తల్లి గురించి మాట్లాడుకోవటం ఎంతో బాగుంది. ఆపాటికి సూర్యుడు పైకి పొడుచుకురావటంతో కవుకు కాయలు బంగారు కాంతితో మెరవసాగాయి, తుమ్మెదలు గడ్డిలో ఝుమ్మంటూ పాడసాగాయి. మలుపు తిరిగిన ప్రతిసారీ కోల్కా తన దిక్సూచిని చూడసాగాడు: "మనం పడమటివైపుకి తిరిగాం, నాన్నా."

"మనం త్వరలోనే అక్కడికి చేరుకుంటాం. దూరంగా ఉన్న లిండెన్ తోపుకి ఎందుకు వెళుతున్నామో తెలుసా, కొడుకా? దగ్గరలోని తోపు ఇప్పుడే ఈడుకొచ్చి, నిండా పూతతో అందంగా ఉంది. దానిని ఒంటరిగా వదిలిపెట్టటం మంచిది. మనం ఇంకొంచెం దూరం వెళదాం: ఇంకొంచెం నడిస్తే మన కాళ్లేమీ అరిగిపోవు. పూతతో ఉన్న ఈ తోపుని తేనెటీగలకు, ప్రకృతి తల్లికి వదిలిపెడదాం."

"నాన్నా, తుమ్మెదలు లిండెన్ చెట్లలోకి వెళతాయా?"

"తుమ్మెదలా? అవి చాలా పెద్దవి కదా: అందుకే అవి చాలావరకు కిందనే ఉంటాయి. గడ్డిపూలు, పొదల పూలకు అవి పరిమితం అవుతాయి. ప్రకృతిలో తనదైన స్థాయిలున్నాయి. ఉదాహరణకు, తోకూపుడు పిట్ట నేలమీద తిరుగుతూ ఉంటుంది, గద్ద ఆకాశంలో విహరిస్తుంది. ప్రతి ఒక్కరికి వారివారి స్థాయి కేటాయించి ఉంది, అందుకే ఏ గొడవా లేదు, ఎక్కడా పరిమితికి మించిన సంఖ్య లేదు. ప్రతి ఒక్కరికి తమ సొంత పని ఉంది, ప్రతి ఒక్కరికి ప్రత్యేకించిన భోజనశాల ఉంది. ప్రకృతి తల్లి ఎవ్వరినీ తక్కువ చెయ్యదు, ఆమె కళ్లల్లో ప్రతి ఒక్కరూ సమానమే."

"ప్రకృతి తల్లిలాగా మనం ఉండలేమా?"

"అహ్, అది... ఎలా చెప్పాలి, కొడుకా. మనందరం కూడా అలాగే ఉండాలి, కాని అది సాధ్యపడటంలేదు."

"ఎందుకని?"

"ఎందుకంటే, మనుషులలో అన్ని స్థాయిలూ కలిసిపోయాయి. ఉదాహరణకు అడవినే తీసుకుంటే, ప్రతిదీ స్పష్టంగా ఉంటుంది: ఒకటి ముళ్లపందిగా పుట్టింది, మరొకటి ఉడత. ఒకటి నేలమీద తిరుగుతూ ఉంటే రెండవది కొమ్మ మీదనుంచి కొమ్మకి దూకుతుంటుంది. కానీ, ముషులు మాత్రం అందరూ ఒకేలాగా పుడతారు. అందరూ నగ్నంగా ఉండి, కేర్‌కేర్‌మంటూ ఉంటారు, అందరికీ తల్లిపాలు కావాలి, అందరూ గోచీగుడ్డలు కంపు చేస్తుంటారు. ఉదాహరణకు, ఎవరు కముజు పిట్టో, ఎవరు డేగో తెలియదు. అందుకే ఎందుకైనా మంచిదని ప్రతి ఒక్కరూ డేగ లాగా ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. అయితే డేగ లాగా ఉండటానికి ప్రయత్నించినంత మాత్రాన సరిపోదు. డేగకి డేగ చూపు, డేగ రెక్కలు ఉంటాయి... ఆ వాసన ఏమిటో తెలుసా, కొడుకా? లిండెన్. ఈ మలుపు తిరగటంతోనే –"

మలుపు దగ్గర కుడిచేతివైపుకి తిరిగిన తరువాత యెగార్‌కి నోట మాట రాలేదు. ఆశ్చర్యంతో అతడికి అడుగు ముందుకు పడలేదు. అతడు కళ్లు మిటకరించాడు. కోల్కా కూడా ఆగిపోయాడు. ఇద్దరి నోటవెంట మాటరాలేదు. ఉడకపోతగా ఉన్న ఉదయం ఎండలో తుమ్మెదలు తమ నేల స్థాయిలో ఝుమ్మంటూ చేస్తున్న నాదం వినపడుతోంది.

బెరడు వలిచేసి ఉన్న లిండెన్ చెట్లు వాడిపోయిన పూలతో నేలను తాకుతూ ఉన్నాయి. స్త్రీ శరీరం మాదిరి వాటి కాండాలు తెల్లగా ఉన్నాయి, ఆ ఆకుపచ్చని సంధ్యా కాంతిలో అవి అస్పష్టంగా గోచరిస్తున్నాయి. ఆ చెట్లనుంచి కారిన రసాలతో నేల తడిగా ఉంది, చనిపోతున్న కాండాలకు ఆ నీటినే వేళ్లు తిరిగి సరఫరా చేస్తున్నాయి.

"వాటిని చంపేశారు," తలమీద టోపీ తీసేస్తూ అన్నాడు యెగార్. "డబ్బు కోసం, అర్థ–రూబులు కోసం వాటిని చంపేశారు."

విధ్వంసానికి గురైన లిండెన్ తోపుని తండ్రి, కొడుకులు నోళ్లు వెళ్లబెట్టుకుని చూస్తూ ఉన్న సమయంలో హారిటీనా తాను ఎంచుకున్న మార్గంలో చివరి ప్రయత్నంలో, చివరి పరుగులో ఉంది. ఆ అడ్డంకి దాటితే భోగభాగ్యాలు కాకపోయినా సౌకర్యవంతమైన జీవితం ఉంటుందని ఆమె ఆశిస్తోంది.

ఆమె నోరు పెద్దదే కానీ ఆమెకు మరీ అంత ధైర్యం లేదు. మొగుడి మీద ఆమె తేలికగా అరవగలుగుతుంది, కానీ బయటవాళ్లతో ఆమె బల్ల గుద్ది మాట్లాడలేదు. బల్లలన్నా, వాటి వెనక ఉండే అధికారులు, కాగితాలు, కప్పుపైకల్లా పోస్టర్లతో ఉండే గోడలన్నా ఆమెకు చెప్పనలవికాని భయం. ఆమె భయం భయంగా లోపలికి అడుగు పెడుతుంది, ఒక పక్కకి ఒదిగి నిలబడుతుంది: ఎవరినీ అడిగే ధైర్యం లేదు, ఏమి అడగాలో తెలియదు. దాంతో తలనుండి కాళ్ల వరకు చెమటలు కారిపోతుండగా ఆమె, "ఏ పనైనా చేస్తాను. జీతముంటే చాలు. పోషించటానికి ఒక కుటుంబం ఉంది."

"నీ వృత్తి ఏమిటి?"

"నా వృత్తా? లోగడ పశువులు కాశాను."

"ఇక్కడ పశువులు లేవు."

"మగవాళ్లున్నారా? వాళ్లను కూడా బాగా చూసుకుంటాను, బట్టలుతుకుతాను, గిన్నెలు కడుగుతాను."

"అవును, పొలుష్కిన్, నీకు చాలా అరుదైన వృత్తి ఉంది! నీ పాస్‌పోర్టు ఉందా?" దానిని తిప్పి ముఖం చిట్లిస్తారు. "నీకొక చిన్న పిల్ల ఉంది."

"ఓల్యా."

"ఇక్కడ శిశు సంరక్షణ కేంద్రం లేదు. అది ప్యోటర్ పెట్రొవిచ్ పరిధిలో ఉంది. వెళ్లి అతడిని కలువు: అతడు నిర్ణయిస్తాడు."

రెండవ వరసలో ప్యోటర్ పెట్రొవిచ్ దగ్గరకి వెళ్లింది. ఆ తరువాత ప్యోటర్ పెట్రొవిచ్ నుంచి ఇవాన్ ఇవనోవిచ్ దగ్గరకు వెళ్లింది. అక్కడి నుంచి...

"అధికారి నిర్ణయం ప్రకారం నడుచుకుంటాను. నాకెటువంటి అభ్యంతరం లేదు. ఇక్కడ ఒక్కటే శిశు సంరక్షణా కేంద్రం ఉంది, పిల్లలు చాలామంది ఉన్నారు."

ఇదే చివరి అవకాశం: ఆ తరువాత ముందుకి దారిలేదు. నెలకి రెండు సార్లు జీతం అందే అవకాశమో, తన కలల అంతమో ఇప్పుడు తేలిపోతుంది. హారిటీనా తన కలలు ఎక్కడ అంతమైపోతాయోనని తెగ భయపడిపోయింది. ఈ చివరి అధికారితో ఈ సమావేశానికి ఆమె ఎంతో శ్రద్ధగా తయారయ్యింది. తన కొత్త గౌను మోకాళ్లవరకు వచ్చేలా సరిచేసుకుంది. జుట్టు

శుభ్రంగా దువ్వుకుని సాధ్యమైనంత అందంగా అలంకరించుకుంది. అక్క మారిట్సా తన పుట్టినరోజునాడు ఇచ్చిన హ్యాండ్‌బ్యాగ్ కూడా చేతపట్టుకుంది. ఓల్యాని టీచరు నోనా యురీవ్నా దగ్గర వదిలిపెట్టింది: ఆమెకి కూడా కొంత అలవాటవుతుంది. సొంతానికి పిల్లల్ని కనాల్సిన వయస్సే ఆమెది. సరదాగా గడిపిన రోజులు ఇక చాలు.

హారిటీనా భయం భయంగా తలుపును తాకింది: రాక్షసుడినో, తోడేలునో చూడటానికి వెళుతున్నట్టు ఉంది ఆమె. అయితే తలుపు వెనక రాక్షసుడికి బదులుగా జడలేకుండా వదిలేసిన పొడవాటి జుట్టు ఉన్న అమ్మాయి ఉంది. ఆమె టైపురైటరు మీద ఏదో టకటకలాడిస్తోంది.

"అధికారిని చూడటానికి వచ్చాను. నా పేరు పొలుష్కిన్."

"ఇదీ దారి."

హారిటీనాని ఆ మర్యాద కదిలించివేసింది. "ఉండు," కాకుండా, "లోపలికి వెళ్లు," కాకుండా, "ఇదీ దారి" అంది. కార్యాలయం వరకు స్వయంగా తోడ్కొని వెళ్లింది.

అధికారి – నడివయసు దాటిన వ్యక్తి, నల్ల కళ్లద్దాలు పెట్టుకుని ఉన్నాడు – అందరి అధికారుల మాదిరి బల్ల వెనక కూర్చుని ఉన్నాడు. అతడు తిన్నగా ముందుకు చూస్తున్నాడు. అయితే నల్ల కళ్లద్దాల కారణంగా అతడి చూపు కఠినంగా ఉందో, ఎలా ఉందో చెప్పటం కష్టం.

"పొలుష్కిన్," తనని తీసుకొచ్చిన అమ్మాయి పరిచయం చేసింది. "పని గురించి వచ్చింది."

హారిటీనా అక్కడ వదిలి ఆ అమ్మాయి వెళ్లిపోయింది. "ఎలా ఉన్నారు శ్రీమతి పొలుష్కిన్. కూర్చోండి," అన్నాడు అధికారి.

అతడు తన చేతిని ముందుకి చాచాడు. అయితే అతడు చేతిని ఆమె వైపుకి చాచలేదు – ఆమె ఒక పక్కకి నిలబడి ఉంది – అతడు తన చేతిని తిన్నగా ముందుకి చాచాడు. దానిని అందుకుని కరచాలనం చెయ్యటానికి హారిటీనా ఆవైపుకి రెండడుగులు వెయ్యాల్సి వచ్చింది.

"అయితే, మీకంటూ ఒక వృత్తి లేదంటారు?"

"ఇంటిపని నేను బాగా చేస్తాను."

ప్రతి కొత్త ప్రదేశంలోనూ, ప్రతి కొత్త అధికారి అవే ప్రశ్నలు అడుగుతాడన్న విషయానికి హారిటీనా త్వరగానే అలవాటుపడింది. కాబట్టి ఆమె ఒకటి తరువాత ఒకటి టకాటకా చెప్పేసింది,

"నేను ఇంటిపని బాగా చేస్తాను. అదీ కాక నాకు పిల్లలు ఉన్నారు. ఇద్దరు. వాళ్లల్లో ఓల్యా చిన్నది: ఆమెను ఒంటరిగా వదిలిపెట్టడానికి లేదు. ఉన్న ఒక్క పందినీ చంపి, అమ్మాల్సివచ్చింది..."

ఆమె చెప్పింది అధికారి విన్నాడు. అయితే అతడు తల ఏమాత్రం తిప్పలేదు. అంతేకాదు అతడు ఎటు చూస్తున్నాడో, ఎలా చూస్తున్నాడో ఏమాత్రం అర్థం కాలేదు. దాంతో హారిటీనా గందరగోళానికి లోనయ్యింది. అసలు విషయం కాకుండా ఆమె నోటికి వచ్చిందల్లా చెప్పుకుంటూ పోసాగింది. దాంట్లో ఆమె ఎంతగా లీనమైపోయిందంటే ఆమెకి ఆపాలనే తెలియలేదు. పిల్లలు, మోటారు, పంది, మంకుపట్టు పట్టే సజనోవ్, ఎందుకూ పనికిరాని తన భర్త – అన్నింటినీ ఒక్క తీగలో చెప్పేసింది. లోపల్లోపల ఆమె కూడా అంతగా చిక్కుపడిపోయింది.

"ఇంతకీ మీకు ఏం కావాలి, శ్రీమతి పొలుష్కిన్? పని కావాలా లేక పిల్లకి శిశు సంరక్షణ కేంద్రమా?"

"శిశు సంరక్షణ కేంద్రం లేకుండా నేను పనికి వెళ్లలేను: పిల్లను చూసుకోటానికి ఇంట్లో ఎవరూ లేరు. ఎల్లకాలమూ నోనా యురీవ్నాని ఇబ్బంది పెట్టలేను కదా."

అతడు ఎటు చూస్తున్నాడో, ఎలా చూస్తున్నాడో చెప్పగలిగితేనా!

"సరే, మీ అమ్మాయిని శిశు సంరక్షణా కేంద్రంలో చేర్పించాం అనుకుందాం, మీకు ఎక్కడ పని చెయ్యాలని ఉంది? ఏదైనా వృత్తి నేర్చుకుంటావా, లేక ఏ పని దొరికితే ఆ పని చేస్తావా?"

"మీరు ఎలా చెబితే అలా. దేనికైనా కాపలా ఉండే పని, శుభ్రం చేసే పని, ఏదైనా."

"మీకు ఏ ప్రాధాన్యతలు లేవా? ఏదో ఒకటి ఉండాలి."

హారిటీనా నిట్టూర్చింది. "నాకున్న ప్రాధాన్యత ఒక్కటే: రోజూ తినటానికి ఇంత సంపాదించటం. నా మొగుడు మీద నమ్మకం పోయింది. పిల్లలకి తిండి, బట్టా సమకూర్చాలి, చదువు చెప్పించి వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడేలా చూడాలి. ఓల్యా కారణంగా నా చేతులు కట్టేసినట్టయ్యింది: ప్రతి రోజూ ఆమెను నోనా యురీవ్నా వద్ద విడిచిపెట్టలేను కదా."

అధికారి నవ్వాడు. "మీ ఓల్యాకి ఏదోఒక చోటు చూద్దాం. ఇక్కడ నీ దరఖాస్తు ఏది?" అతడు తల తిప్పకుండా బల్లమీద కాగితం కోసం తడమసాగాడు. ఒక కాగితాన్ని చూపిస్తూ, "ఇదేనా?" అని అడిగాడు.

హారిటీనా ఒక్కసారిగా లేచి నిలబడింది.

"దేవుడా, మీకు గాని కళ్లు కనపడవా ఏమిటి, అయ్యగారూ?"

"అవును, శ్రీమతి పొలుష్కిన్, నా చూపు పోయింది. కానీ, నువ్వు చెప్పినట్టు మనందరం ఏదో ఒక విధంగా రోజువారీ తిండి సంపాదించుకోవాలి కదా?"

"మీరు అంతగా చదివినందువల్ల మీ చూపు పోయింది కదూ?"

"చదువు కాదు – యుద్ధం. మొదట్లో కొంచెం చూడగలిగేవాడిని. కానీ మెల్లగా పరిస్థితి విషమించసాగింది. చివరికి నల్లటి నలుపు మాత్రం మిగిలింది. ఇదే కదా నీ దరఖాస్తు?"

హారిటీనా పెదాలు వణుకుతున్నాయి; ఆమెకు ఏడుపు వస్తోంది, రైతు మహిళ మాదిరి పెద్దపెట్టున రోదించాలని ఆమెకుంది. కానీ ఎలాగో తమాయించుకుంది. కాగితంవైపుకి అతడి చేతిని మళ్లించింది. నల్ల కళ్లద్దాల కళ్లు ఎదుటిగోడమీదనుంచి మరల్చకుండా, అతడు తీర్మానాన్ని రాశాడు.

ఆమె ఇంటికి తిరిగి వచ్చేసరికి భర్త, కొడుకు సాధువుల మాదిరి కూర్చుని ఉన్నారు.

"బెరడు ఏదీ?"

"బెరడు లేదు. రాలిపోతున్న పూలతో నగ్న కన్యల మాదిరి లిండెన్ చెట్లు నిలబడి ఉన్నాయి."

హారిటీనా అరుపులకు యెగార్ సిద్ధంగా ఉన్నాడు. కానీ, ఆమె అరవలేదు, నిట్టూర్చిందంతే.

"నా మొగుడుకంటే ఒక గుడ్డి మనిషి నా గురించి బాగా పట్టించుకుంటాడు."

యెగార్ బాగా అవమానానికి లోనయ్యాడు. ఒక్క దూకు దూకాడు.

"దానికి బదులుగా అతడు అడవిని పట్టించుకుని ఉండాల్సింది! పెద్దఎత్తున జరుగుతున్న దొంగతనాన్ని చూసి ఉండాల్సింది! అలా బెరడు వలిచిన వాళ్లనందరినీ పట్టుకుని నిర్బంధించి ఉండాల్సింది!"

చెయ్యి విదిలింపుతో ఆ విషయాన్ని అంతటితో ముగించాడు. చుట్ట కాల్చుకోటానికి బయటకు వెళ్లాడు.

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige
.com